830) గౌళ

ప|| పూవుబోణులకొలువే పుష్పయాగము । పూవక పూచె నీకిట్టె పుష్పయాగము ||

చ|| కలువరేకుల వంటి ఘనమైన కన్నుల । పొలతుల చూపులే నీ పుష్పయాగము ।
తలచి తలచి నిన్ను తమమేనుల బొడమే । పులక జొంపములె నీ పుష్పయాగము ।

చ|| కరకమలములను కందువగోపికలెల్లా । పొరసి నిను జూపుటే పుష్పయాగము ।
సరసపు మాటలే సారెనాడి తమనవ్వు । పొరి నీపై జల్లుటే పుష్పయాగము ||

చ|| గాటపు కొలనిదండ కాంతలు సిగ్గున నిన్ను । బూటకానకు దిట్టుటే పుష్పయాగము ।
యీటున శ్రీవేంకటేశ యిట్టె యలమేలుమంగ । పూటవూటరతులివి పుష్పయాగము ||